## 22వ అధ్యాయము

# దేవుని ఆత్మచేత నడిపింపబడుట ఎట్లు?

విశ్వాసుల జీవితములో పరిశుద్ధాత్మ యొక్క పాత్రను గురించిన అనేక వాగ్దానాలు యోహాను సువార్తలో నమోదు చేయబడ్డాయి.

> నేను తండ్రిని వేడుకొందును, మీయొద్ద ఎల్లప్పుడు నుండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను, అనగా సత్యస్వరూపియగు ఆత్మను మీకను గ్రహించును. లోకము ఆయనను చూడదు, ఆయనను ఎరుగదు గనుక ఆయనను పొందనేరదు; మీరు ఆయనను ఎదుగుదురు. ఆయన మీతో కూడ నివసించును, మీలో ఉండును (యోహాను 14:16-17).

> ఆదరణకర్త, అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును (యోహాను 14:26).

> అయితే నేను మీతో సత్యము చెప్పుచున్నాను, నేను వెళ్లిపోవుటవలన మీకు ప్రయోజనకరము; నేను వెళ్ళనియెడల ఆదరణకర్త మీయొద్దకు రాడు; నేను వెళ్ళినయెడల ఆయనను మీయొద్దకు పంపుదును....నేను మీతో చెప్పవలసినవి ఇంకను అనేక సంగతులు కలవు గాని యిప్పుడు మీరు వాటిని సహింపలేరు. అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును, ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును. గనుక నన్ను మహిమపరచును. తండ్రికి కలిగినవన్నియు నావి, అందుచేత ఆయన నావాటిలోనిని తీసికొని మీకు తెలియజేయునని నేను చెప్పితిని. కొంచెము కాలమైన తరువాత మీరిక నన్ను చూడరు, మరి కొంచెము కాలమునకు నన్ను చూచెదరని చెప్పెను (యోహాను 16:7, 12-15).

యేసు ప్రభువు తమ శిష్యులతో పరిశుద్ధాత్మ వారిలో నివసిస్తాడని వాగ్దానము చేశారు. ఆయన వారికి సహాయము చేసి, బోధించి నడిపించి మరియు రాబోవు సంగతులను తెలియజేస్తాడు. ఈనాటి క్రీస్తు శిష్యులకు ఆయన తక్కువ చేస్తాడని ఆలోచించుటకు ఏమాత్రము కారణము లేనేలేదు.

ఆశ్చర్యమైన రీతిలో యేసుప్రభువు తాను తిరిగా వెళ్ళిపోవుట శిష్యులకు ప్రయోజకరమని తాను తిరిగి వెళ్ళకపోతే పరిశుద్ధాత్మ రాడని చెప్పాడు. పరిశుద్ధాత్మతో సహవాసం యేసు ప్రభువు శరీరకంగా ఉన్నదానితో సమానమని వారికి గుర్తుగా తెలియజేయబడింది.

లేనియెడల వారి యొక్క ప్రయోజనం కొరకు యేసుకు బదులు పరిశుద్ధాత్మ రావడం జరగదు. పరిశుద్ధాత్మ ద్వారా యేసుప్రభువే ఎల్లప్పుడు మనతోనే మనలోనే ఉంటారు.

ఏవిధంగా పరిశుద్ధాత్మ మనలను నడిపిస్తారనుకోవచ్చు?

ఆయనపేరే పరిశుద్ధ ఆత్మ, అనగా మనలను పరిశుద్ధతలోనికి దేవునియందు విధేయతకు మనలను నడుపుటయే ఆయన ప్రధాన పాత్ర అని తెలియజేస్తుంది. పరిశుద్ధతకు సంబంధించి దేవుని చిత్తాన్ని నెరవేర్చుటకు చేయువన్ని పరిశుద్ధాత్మ యొక్క నడిపింపుకు సంబంధించినవే. దేవుడు మనలను పిలిచిన ప్రత్యేకమైన సేవకు సంబంధించి యేసు చెప్పిన ప్రత్యేకమైన ఆజ్ఞలు మరియు సామాన్యమైన ఆజ్ఞలన్నింటికి మనము లోబడునట్లు ఆయనే నడిపిస్తారు. నీ సేవ నిమిత్తమై నీవు ఆత్మ చేత నడిపించబడాలంటే నీవు పరిశుద్ధాత్మ యొక్క పరిశుద్ధత చేత నీవు ముందుగా నడిపించబడాలి. ఈ రెండింటిలో ఒకటి మాత్రమే నీవు కలిగియుండుట సాధ్యము కాదు. అనేక మంది సేవకులు పరిశుద్ధాత్మ వారిని గొప్ప పరిచర్యలోనికి మరియు అద్భుతాల అనుభవంలోనికి నడిపించబడాలని కోరుచూ ఉంటారు, కాని పరిశుద్ధతను సంబంధించిన "చిన్న" విషయాలలో ఏ మాత్రము పట్టించుకోరు. అది చాలా పెద్దపొరపాటు. యేసుప్రభువు తన శిష్యులను ఏవిధంగా నడిపించారు? ప్రాముఖ్యంగా వారికి పరిశుద్ధతను గూర్చిన సాధారణమైన సూచనలను ఇచ్చాడు. సేవకు సంబంధించిన బాధ్యతలను గురించి ఆయన నడిపించుట మనము అరుదుగా గమనిస్తాము. కాబట్టి మనలో నివసించే పరిశుద్ధాత్ముడే మనలను నడిపిస్తాడు. కాబట్టి నీవు పరిశుద్ధాత్మ చేత నడిపించబడాలని కోరుకొనుచున్నట్లయితే, మొదటిగా నీవు పరిశుద్ధతను గూర్చిన నడిపింపును అనుసరించాలి.

అపొస్తలుడైన పౌలు ఇలా వ్రాసాడు, "దేవుని ఆత్మచేత ఎందరు నడిపింపబడుదురో వారందరు దేవుని కుమారులై యుందురు" (రోమా 8:14). దేవుని పిల్లలలో మనము ఉండులాగున పరిశుద్ధాత్మచేత నడిపించబడతాము. ఈవిధంగా దేవుని పిల్లలందరూ ఆత్మచేత నడిపించబడతారు. ఆత్మయొక్క నడిపింపుకు విధేయులమగుట అనునది కేవలం మనకే వదిలి వేయబడింది.

ప్రతి క్రైస్తవుని పరిశుద్ధాత్మ నడిపించుచున్నాడు కాబట్టి ఆత్మచేత నడిపించుబడుట ఎట్లు అని క్రైస్తవులకు అంతగా బోధించనవసరం లేదు. కాని మరొకవైపు చూస్తే దేవుని చిత్తానికి వ్యతిరేకించునట్లు మరియు మనలను తప్పుదోవ పట్టించుటకు మన పాత స్వభావము మరియు సాతాను ఎల్లప్పుడు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. కాబట్టి విశ్వాసులు పరిశుద్ధాత్మయొక్క నడిపింపేదో వేరే నడిపింపేదో అనే విషయాలు వివేచించుట నేర్చుకోవాలి. ఆత్మీయ ఎదుగుదలకు ఇది ఒక క్రమమైనపద్ధతి. కాని పునాది సత్యమేమంటే వ్రాయబడిన దేవుని వాక్య ప్రకారంగా ఎలప్పుడు పరిశుద్ధ ఆత్మ మనలను నడిపిస్తుంది మరియు దేవునికి ఇష్టమైన మరియు సరియైన విధంగానే మనలను ఎల్లప్పుడు నడిపిస్తుంది (యోహాను 16:14 చూడండి).

## పరిశుద్ధాత్మ యొక్క స్వరము

పరిశుద్ధాత్మ దేవుడు అద్భుతమైన రీతిలో దర్శనము ద్వారా, ప్రవచనముల ద్వారా, స్వరము ద్వారా ఆయన నడిపిస్తారని వాక్యము మనకు బోధిస్తుంది, అంతేకాక పరిశుద్ధాత్మ

మన ఆత్మలో, "తలంపులను పుట్టించుట" ద్వారా కూడా మనతో ముచ్చటిస్తాడు. అనగా ఏదైన ఒక పనిని పరిశుద్ధాత్ముడు మనము చేయాలని కోరుకున్నప్పుడు ఆయన మన ఆత్మను "సంధిస్తాడు" అప్పుడు ఒక ప్రత్యేకమైన మార్గమును అనుసరించు "నడిపింపు" మనకు కలుగుతుంది.

ఆత్మయొక్క స్వరమును మన "మనస్సాక్షి"అని పిలవవచ్చును. ప్రతి క్రైస్తవుడు తన మనస్సాక్షి ఎలా ఉంటుందో ఎరుగుదురు. మనము పాపము చేయుటకు శోధించబడినప్పుడు, "శోధనలో పడవద్దు" అన్న స్వరం మనలో వినిపించదు, కాని ఆ శోధనను జయించే శక్తి మన హృదయంలో ఏదో ఉన్నట్లుగా భావన కలుగుతూ ఉంటుంది. ఒకవేళ మనము ఆ పాపములో పడిపోయినట్లయితే "నీవు పాపంచేశావు! నీవు పాపం చేశావు!" అనే స్వరం వినిపించదు కాని పశ్చాత్తాపపడి, ఒప్పుకొనునట్లు మన హృదయములో ఒక ప్రేరేపణ కలుగుతుంది.

ఇదేవిధంగా ఆత్మ మనకు బోధించి సత్యము లోనికి మనలను నడిపిస్తుంది మరియు ఆ సత్యమును గ్రహించుటలో సాయపడుతుంది. బైబిల్ వాక్యాలకు అనుగుణంగా హఠాత్తుగా ప్రత్యక్షత ద్వారా ఆయన మనకు బోధిస్తాడు. ఆత్మద్వార కొన్ని క్షణాల్లో దేవుడు ఆ విషయాన్ని బయలుపరచవచ్చు కాని దానిని వేరే వాళ్ళకు వివరించాలంటే పదినిమిషాలు పడుతుంది.

ఇదేవిధంగా మన సేవా పరిచర్యలో కూడా పరిశుద్ధాత్మ మనలను నడిపిస్తాడు. మనం కేవలం కొంత ప్రయత్నం ద్వారా మనలో నడిపింపును మరియు తలంపులను గ్రహిస్తూ నెమ్మదిగా కొన్నిసార్లు (ప్రయత్నిస్తూ లేదా పొరపాట్లు చేస్తూ) సేవకు సంబంధించిన విషయాలు నేర్చుకొనుటకు పరిశుద్ధాత్మను వెంబడిస్తాం. మన ఆలోచనలు (బుద్దిగలవి లేదా బుద్ధిహీనమైనవి) మన భావాలకు అడ్డు వస్తున్నప్పుడు (పరిశుద్ధాత్మ నివసించు చోటు) దేవుని చిత్తమునకు వ్యతిరేకంగా తప్పులు చేస్తున్నట్లు గమనిస్తాము.

## ఆత్మ చేత యేసుప్రభువు నడిపించబడుట

ప్రభువైన యేసు హృదయ తలంపుల ద్వారా పరిశుద్ధాత్మ చేత నడిపించబడ్డాడు. ఉదాహరణకు మార్కు సువార్తలో యేసు ప్రభువు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిన తరువాత జరిగిన విషయం వ్రాయబడింది.

> వెంటనే పరిశుద్ధాత్మ ఆయనను అరణ్యములోనికి ***త్రోసికొనిపోయెను***
> (మార్కు 1:12)

యేసు ప్రభువు అరణ్యములోనికి నడిపించబడినప్పుడు ఆయనకు స్వరము వినబడలేదు మరియు దర్శనాన్ని చూడలేదు కాని ఆయన ***ప్రేరేపించబడ్డాడు***. అదేవిధంగా పరిశుద్ధాత్మ మనలను సాధారణంగా నడిపిస్తుంటాడు. ఒక విషయాన్ని బట్టి మనలో ఒక నడిపింపు, ఒక సమ్మతి లేదా ఒక దృఢనిశ్చయం కలగటం గ్రహిస్తాం.

ఇంటి పైకప్పులో నుంచి దింపబడిన పక్షవాయువు కలిగిన వ్యక్తి పాపములు క్షమించబడినవని చెప్పినప్పుడు తాను దేవదూషణ చేస్తున్నాడని అనుకొనుచున్న పరిసయ్యుల మనస్సు యేసు ఎరిగేయున్నాడు. వారి ఆలోచనలు ఆయనకు ఎలాతెలుసు? మార్కు సువార్తలో

మనం ఇలా చదువుతాము:

> వారు తమలో తాము ఈలాగున ఆలోచించుకొనుట యేసు వెంటనే ***తన ఆత్మలో తెలిసికొని,*** మీరీలాటి సంగతులు మీ హృదయములలో ఎందుకు ఆలోచించుకొనుచున్నారు? (మార్కు 2:8)

యేసు ఆత్మలో వారు అనుకుంటున్న విషయాలను గ్రహించాడు. మనము కూడా ఆత్మ ప్రబోధాలను ఇంద్రియ జ్ఞానముతో గ్రహించగలిగినట్లయితే మన సేవలో వ్యతిరేకులకు ఎలా జవాబు చెప్పాలో మనం కూడా తెలుసుకోవచ్చు.

## పౌలు పరిచర్యలో ఆత్మయొక్క నడిపింపు

పౌలు సుమారు 20 సం॥లు ప్రభువు సేవలో ఉన్న తర్వాత, ఆత్మ నడిపింపును ఎలా అనుసరించాలో నేర్చుకున్నాడు. తన సేవకు సంబంధించి, "రాబోవుచున్న విషయాలను" ఆత్మ కొంతవరకు తెలియజేసింది. ఉదాహరణకు పౌలు ఎఫెసులో తన సేవను ముగించుచున్నప్పుడు తరువాత మూడుసంవత్సరాలలో తన జీవితము మరియు పరిచర్యను గూర్చిన ఒక అవగాహనను కలిగియుండుట మనం గమనించగలము.

> ఈలాగు జరిగిన తరువాత పౌలు మాసిదోనియ అకయ దేశముల మార్గమునవచ్చి యెరూషలేమునకు వెళ్ళవలెనని మనస్సులో ఉద్దేశించి, నేనక్కడికి వెళ్ళిన తరువాత రోమాకూడ చూడవలెనని అనుకొనెను (అపొ॥ 19:21).

గమనించవలసిన విషయమేమంటే పౌలు ఈ ప్రణాళికను తన **మనస్సు**లో కాదుగాని ***ఆత్మ*** చేత ఉద్దేశించినాడు. అనగా ఆత్మనడిపింపు మొదట పౌలును మాసిదోనియ మరియు అకయలకు నడిపించింది (ఈ రెండు ఆధునిక గ్రీసు దేశంలో ఉన్నాయి). ఆ తరువాత యెరూషలేముకు మరియు చివరిగా రోమా పట్టణానికి నడిపించబడ్డాడు. ఆ ప్రకారంగా ఆ నడిపింపును అతను ఖచ్చితంగా అనుసరించాడు. మీ బైబిలులో పౌలుయొక్క మూడవ పరిచర్య ప్రయాణమును చూపించే పటము ఉన్నట్లయితే ఆత్మచేత పౌలుకు ప్రేరేపించబడిన మార్గము మాసిదోనియ, అకయ ద్వారా యెరూషలేమునకు మరియు అనేక సం॥లు తర్వాత రోమా పట్టణానికి తను చేసిన ప్రయాణ మార్గాన్ని గమనించవచ్చును.

క్లుప్తంగా చెప్పాలంటే పౌలు మాసిదోనియ మరియు అకయలగుండా ప్రయాణము చేసి మరల మాసిదోనియకు అనగా వెనుకకు వచ్చి అయెగన్ సముద్రతీరము చుట్టుకుంటూ చిన్న ఆసియా యొక్క అయెగన్ సముద్రతీరము గుండా ప్రయాణము చేసాడు. తన ప్రయాణ సమయములో మిలేతు వద్ద ఆగి దగ్గరలో ఉన్న ఎఫెసు సంఘ పెద్దలను పిలిపించి వారికి తన వీడ్కోలు సందేశాన్ని ఇచ్చాడు.

> ఇదిగో నేనిప్పుడు ***ఆత్మయందు బంధింపబడినవాడనై*** యెరూషలేమునకు వెళ్లుచున్నాను, అక్కడ నాకు ఏమేమి సంభవించునో తెలియదుగాని, బంధకములును శ్రమలును నా కొరకు

కాచుకొనియున్నవని పరిశుద్ధాత్మ ప్రతి పట్టణములోను నాకు
సాక్ష్యమిచ్చుచున్నాడని తెలియును (అపొ॥ 20:22-23).

పౌలు చెబుతున్నాడు, తాను "ఆత్మయందు బంధింపబడ్డాను" అని, అనగా తాను యెరూషలేముకు వెళ్ళవలెననెడి ఒక నడుపుదల తనలో కలిగింది అని అర్థం. యెరూషలేమునకు వెళ్ళిన తరువాత ఏమి జరుగుతుంది అన్న దానిగురించి అతనికి పూర్తిగా వెల్లడి చేయబడలేదు. కాని ప్రయాణంలో తాను ఆగుతున్న ప్రతి పట్టణంలో, బంధకములు, శ్రమలు తన కోసం కాచుకొని ఉన్నాయని పరిశుద్ధాత్మ సాక్ష్యమిచ్చాడు. ఆ బంధకములు, శ్రమలు అతనికోసం కాచుకొని ఉన్నాయని పరిశుద్ధాత్ముడు ఏవిధంగా "సాక్ష్యమిచ్చాడు?"

## రెండు ఉదాహరణలు

అపొ॥ 21వ అధ్యాయంలో రెండు సంఘటనలు ఈ ప్రశ్నకు జవాబిస్తున్నాయి. మొదటి ఉదాహరణ ఏమిటనగా, పౌలు తన ప్రయాణంలో తూరు పట్టణములో దిగెను.

మేమక్కడ నున్న శిష్యులను కనుగొని యేడుదినములక్కడ ఉంటిమి.
వారు, నీవు యెరూషలేములో కాలు పెట్టవద్దని ఆత్మ ద్వారా పౌలుతో
చెప్పిరి (అపొ॥ 21:4).

ఈ ఒక్క వచనము బట్టి కొంతమంది వ్యాఖ్యాతలు పౌలు దేవుని మాట వినకుండా యెరూషలేమునకు ప్రయాణం కొనసాగించాడు అన్న అభిప్రాయానికి వస్తారు. అపొ గ్రంథములో తరువాత వచనాలను గనుక మనం చదివి గ్రహిస్తే మనం ఆ అభిప్రాయానికి రాము. మనం కథలోనికి వెళుతుండాగా ఇది ఇంకా స్పష్టంగా అర్థం అవుతుంది.

వాస్తవంగా తూరులోని శిష్యులు ఆత్మ ప్రభోదాన్ని సూక్ష్మంగా గ్రహించి యెరూషలేములో ప్రమాదం పొంచియున్నదని వివేచింపగలిగారు, వారు అతనిని వెళ్ళవద్దని ఒప్పించటానికి చూశారు. విలియమ్ అనువదించిన క్రొత్త నిబంధనలో పైన చెప్పబడిన వచనం ఇందులో ఈ విధంగా అనువదించబడింది, "పరిశుద్ధాత్ముని యొక్క ప్రభోదం వల్ల వారు పౌలును యెరూషలేమునకు వెళ్ళవద్దని వారిస్తూ వచ్చారు."

తూరులోని శిష్యులు పౌలును వెళ్ళనీయకుండా ఆపటములో విఫలమయ్యారు, ఎందుకంటే పౌలును వారు ఎంత వారిస్తున్నప్పటికీ అతను యెరూషలేమునకు ప్రయాణం కట్టాడు. దీని ద్వారా మనకు తెలుస్తున్నది ఏమంటే మన ఆత్మలో వెల్లడి చేయబడిన విషయాలకు మన సొంత అర్థాన్ని చేర్చకుండా జాగ్రత్త పడాలి అన్నది గ్రహించాలి. యెరూషలేములో ప్రమాదం పొంచి ఉన్నదని పౌలుకు బాగుగా తెలుసు, అయితే ఏదిఏమైనా యెరూషలేమునకు ప్రయాణం అవ్వటం తన పట్ల దేవుని చిత్తమని కూడా గ్రహించాడు. దేవుడు పరిశుద్ధాత్ముని ద్వారా మనకు ఏదైన బయలుపరచినాడంటే మనం దానిని ఇతరులకు చెప్పాలని కాదు, అంతేకాక పరిశుద్ధాత్మ బయలు పరచిన దానికి మనసొంత అర్థాన్ని చేర్చకుండా కూడా జాగ్రత్తపడాలి.

## సిరియలో ఆగుట

యెరూషలేముకు ప్రయాణించుచున్నప్పుడు తరువాత ఆయన ఆగిన స్థలం సిరియ

అయియున్నది.

> మేమనేక దినములక్కడ ఉండాగా, అగబు అను ఒక ప్రవక్త యూదయనుండి వచ్చెను. అతడు మాయొద్దకు వచ్చి పౌలు నడికట్టు తీసికొని, తన చేతులను కాళ్ళను కట్టుకొని-యెరూషలేములోని యూదులు ఈ నడికట్టుగల మనుష్యుని ఈలాగు బంధించి, అన్యజనుల చేతికి అప్పగింతురని పరిశుద్ధాత్మచెప్పుచున్నాడనెను (అ.కా.21:10-11).

యెరూషలేములో కలుగబోవు "బంధకాలు మరియు శ్రమల" గురించి పరిశుద్ధాత్మ దేవుడు సాక్ష్యమిచ్చిన మరో ఉదాహరణలో ఇక్కడ మనం చూస్తాము. ఇక్కడ మనము గమనించవలసినది ఏమంటే అగబాసు పౌలును, "యెరూషలేముకు వెళ్ళవద్దని, ఇదే ప్రభువైన యెహోవా వాక్కు!" అని చెప్పలేదు. దేవుడు పౌలును యెరూషలేమునకు నడిపించుచున్నాడు మరియు రాబోవుచున్న శ్రమల గురించి అగబాసు యొక్క ప్రవచన పరిచర్య ద్వారా పౌలును సిద్ధపరచుచున్నాడు. కొన్నినెలల క్రితం పౌలు తన హృదయములో ఆత్మ ద్వారా ఏమైతే అనుకున్నాడో అదే విషయాన్ని అగబాసు కేవలం బలపరచాడు అన్న విషయాన్ని మనము ఇక్కడ గుర్తించాలి. ప్రవచనం మనం ఆత్మలో ముందే ఎరిగియున్న దానిని స్థిరపరచక పోయినట్లయితే మనము ప్రవచనముతో ఎప్పుడూ నడిపించబడకూడదు.

అగబాసు ప్రవచనం మనం, "అద్భుతమైన నడుపుదల"గా భావించవచ్చు, ఎందుకంటే పౌలు ఆత్మద్వారా వివేచించిన దానికంటే ఎక్కువగా అగబాసు యొక్క ప్రవచనం వెళ్ళింది. మనం వెళ్ళే మార్గం సులభతరమైనది కాదు కనుక దేవుడు సాధారణంగా దర్శనముల ద్వారనో లేక స్వరము వినిపించుట ద్వారానో "తన గొప్ప నడుపుదలను" అనుగ్రహిస్తాడు. మనకు మరికొంత స్థిరమైనటువంటి నమ్మకం కలగాలి అంటే ఇటువంటి నడుపుదల అవసరం. తన భవిష్యత్తులో చెరసాలలో బంధింపబడి ఒక ఖైదీగా రోముకు వెళ్ళకముందు అతను ఒక గొప్ప గుంపు చేతిలో చంపబడబోవుచున్నాడు. తను పొందిన గొప్ప నడుపుదల కారణంగా ఏది జరిగిన తన మంచికని ఎరిగియున్నాడు కనుక, తన హృదయములో మనశ్శాంతిని కలిగియున్నాడు.

మీరు కూడా ఒక ప్రత్యేకమైన నడుపుదల మీకు లభించకపోతే మీరు దాని కొరకు కనిపెట్టవలసి ఉంది. మన అంతరంగపు నడిపింపు నిమిత్తము మనము ఎల్లప్పుడూ శ్రద్ధ వహించవలసియున్నది.

## సంకెళ్ళలో మరియు దేవుని చిత్తములో

పౌలు యెరూషలేముకు వచ్చినప్పుడు ఆయన బంధింపబడ్డాడు. ఆ సమయంలో మరోసారి ఆయన యేసు యొక్క దర్శనం ద్వారా అద్భుతమైన నడిపింపును పొందాడు.

> ఆ రాత్రి ప్రభువు అతనియొద్ద నిలుచుండి-ధైర్యముగా ఉండుము, యెరూషలేములో నన్నుగూర్చి నీవేలాగు సాక్ష్యమిచ్చితివో అలాగున

రోమాలోకూడ సాక్ష్య మియ్యవలసియున్నదని చెప్పెను (అ.కా 23:11).

ఇక్కడ యేసుప్రభువు పౌలుతో, "పౌలా! నీ వెందుకు ఇక్కడ ఉన్నావు? నేను నీకు జరుగబోవు ప్రమాదము గురించి హెచ్చరించాను కదా!" అని చెప్పలేదు, కాని ఇంతకు ముందు పౌలు కొన్ని నెలల క్రితం వివేచించిన విషయాన్నే యేసు ప్రభువు స్థిరపరచాడు. యేసుప్రభువు పక్షాన యెరూషలేములో సాక్షిగా ఉండుటకొరకై పౌలు దేవుని యొక్క ప్రణాళిక ప్రకారంగానే ఆయన చిత్తములోనే ఉండియున్నాడు. తర్వాత ఆయన క్రీస్తును రోమాలో కూడా ప్రకటించబోతూ ఉన్నాడు.

అ.కా 9:15 ప్రకారం పౌలు యూదులకు మరియు అన్యులకు సువార్త ప్రకటించడం మాత్రమే కాదుకాని ఆయన రాజుల ముందుకూడ సువార్త ప్రకటించవలసి వచ్చెను అన్నది మనం గమనించాలి. పౌలు యెరూషలేము మరియు సిసిరియలోను చెరసాలలో బంధించబడి యున్నప్పుడు పిలాతుకు పొంతి పిలాతుకు మరియు అగ్రిప్ప రాజుకు (దాదాపుగా ఒప్పించబడ్డాడు) యేసు గూర్చి సాక్ష్యమిచ్చాడు (అ.కా 26:25). చివరిగా రోమా చక్రవర్తి అయిన నీరో ముందు క్రీస్తును గూర్చి సాక్ష్యమిచ్చుటకు పౌలు పంపబడ్డాడు.

## నీరోను చూడటానికి వెళ్ళే దారిలో

తనను ఇటలీకి తీసుకొనివెళ్ళే ఓడలో తన ఆత్మలో పౌలు మరోసారి ప్రభువు నడిపింపును పొందియున్నాడు. ఓడ నాయకుడు ఓడను క్రేతు ద్వీపములో ఎక్కడ ఆపాలోనని ఆలోచిస్తున్నప్పుడు, పౌలుకు ఒక ప్రత్యక్షత కలిగింది.

> చాల కాలమైన తరువాత ఉపవాసదినము కూడ అప్పటికి గతించినందున ప్రయాణముచేయుట అపాయకరమై యుండెను. అప్పుడు పౌలు-అయ్యలారా, యీ ప్రయాణమువలన సరకులకును ఓడకును మాత్రమే కాక మన ప్రాణములకు కూడా హానియు బహు నష్టమును కలుగునట్లు నాకు **తోచుచున్నదని** చెప్పి వారిని హెచ్చరించెను" (అ.కా27:9-10).

ఇందులో పౌలు జరగబోయే విషయాన్ని గమనించాడు అతనికి ఆ గ్రహింపు ఆత్మచేత అనుగ్రహించబడింది.

దురదృష్టవశాత్తు పౌలు చెప్పిన విషయాన్ని ఓడ నావికుడు వినక మరొక రేవులో ఆపాలని ప్రయత్నించాడు. రెండు వారాలుగా ఓడ పెనుగాలిలో చిక్కుకొంది. పరిస్థితి అతి కష్టంగా తయారవుతున్నందున, ఓడ సిబ్బంది రెండవ రోజున ఓడలో నున్న సరకును పారవేయడం ప్రారంభించారు. మూడవరోజున తమచేతులార ఓడయొక్క సామాగ్రిని పారవేసిరి. కొంత సమయం తదుపరి పౌలు మరొక నడిపింపును పొందియున్నాడు.

> కొన్ని దినములు సూర్యుడైనను నక్షత్రములైనను కనబడక పెద్దగాలి మామీద కొట్టినందున ప్రాణములతో తప్పించుకొందుమను ఆశ బొత్తిగా పోయెను. వారు బహుకాలము భోజనము లేక యున్నందున పౌలు

వారి మధ్యను నిలిచి-అయ్యలారా, మీరు నా మాట విని క్రేతునుండి బయలుదేరకయే యుండవలసినది. అప్పుడీ హానియు నష్టమును కలుగకపోవును. ఇప్పుడైనను ధైర్యము తెచ్చుకొనుడని మిమ్మును వేడుకొనుచున్నాను, ఓడకేగాని మీలో ఎవని ప్రాణమునకును హానికలుగదు. నేను ఎవనివాడనో, యెవనిని సేవించుచున్నానో, ఆ దేవుని దూత గడచిన రాత్రి నా యొద్ద నిలిచి-పౌలా, భయపడకుము, నీవు కైసరు ఎదుట నిలువవలసియున్నది, ఇదిగో నీతోకూడ ఓడలో ప్రయాణమై పోవుచున్న వారందరిని దేవుడు నీకు అనుగ్రహించియున్నాడని నాతో చెప్పెను. కాబట్టి అయ్యలారా, ధైర్యము తెచ్చుకొనుడి, నాతో దూత చెప్పిన ప్రకారము జరుగునని నేను దేవుని నమ్ముచున్నాను. అయినను మనము కొట్టుకొనిపోయి యేదైన ఒక ద్వీపముమీద పడవలసియుండునని చెప్పెను (అ.కా 27:20:26)

ఈ అపాయకరమైన స్థితిలనుబట్టి దేవుడు "ఒక ప్రత్యేకమైన నడుపుదలను" పౌలుకిచ్చినట్లు మనము గమనించవచ్చు. ఈ కఠినమైన అనుభవం కంటే ఓడ ధ్వంసమయ్యే పరిస్థితిని పౌలు ఎదుర్కొనబోవు చున్నాడు. తర్వాత పాము తనను కరువబోతుంది (అపొ 27:41-28:5). ఏమి జరిగినను ఫర్వాలేదని దేవుని దూత చేత మాట పొందటం మనకు ఎంతైన మంచిదయినది.

## కొన్ని ఆచరింపదగిన సలహాలు

పరిశుద్ధాత్మ నడిపింపు, గ్రహింపుల కొరకు నీ ఆత్మలో కనిపెట్టాలి. కాని ప్రారంభంలో పరిశుద్ధాత్మ నడిపింపు కాకపోయినా అది ఆయన నడిపింపేమోననుకొని పొరపాట్లు నీవు చేయవచ్చు. అది సహజమే. దేనిని బట్టి నిరుత్సాహపడవద్దు.

దీనిని బట్టి బైబిలు చదువుచు, భాషలలో మాట్లాడుచూ కొంత సమయాన్ని ప్రశాంతమైన స్థలంలో గడుపడానికి అవకాశం కలుగుతుంది. మనము అన్యభాషలతో ప్రార్థించినప్పుడు మన ఆత్మ ప్రార్థిస్తుంది. అలాంటపుడు మన ఆత్మనడిపింపును మనం క్షుణ్ణంగా తెలుసుకోగలం. దేవుని వాక్యం ఆత్మీయ ఆహారం గనుక ఆ వాక్యాన్ని చదివి ధ్యానించుట ద్వారా కూడా మన ఆత్మ నడిపింపును క్షుణ్ణంగా తెలుసుకోగలము.

దేవుడు నిన్ను ఒక వైపునకు నడిపించుచున్నప్పుడు ఆ నడిపింపు అంతటితో ఆగిపోదు. నీ స్వంత ఆలోచనలు మరియు భావోద్రేకముల వల్ల కాకుండా దేవుడే నడిపించుచున్నాడన్న విషయాన్ని స్థిరపరచుకొనడానికి మన ప్రార్థనను కొనసాగిస్తూ ఉండాలి. ఒక విషయాన్ని ప్రార్థిస్తున్నప్పుడు నీ హృదయములో ప్రశాంతత లేకున్నట్లయితే, అలాంటి ప్రశాంతత కలుగు వరకు ఆ మార్గాన్ని అనుసరించవద్దు.

నీవు ఒక ప్రత్యేకమైన నడిపింపు కలిగినప్పుడు అది మంచిదే, కాని దర్శనం పొందుతావని స్వరం వినగలనని మాత్రం విశ్వసించవద్దు. వాటి ద్వారా దేవుడు నడిపిస్తానని

ఎటువంటి వాగ్దానము చెయ్యలేదు (తన చిత్తప్రకారం కొన్నిసార్లు అలాకూడ దేవుడు చేస్తాడు). ఏది ఏమైనప్పటికీ మన అంతరంగంలోని ఆత్మ సాక్ష్యం ద్వారా దేవుడు నడిపిస్తాడని మనం విశ్వసించాలి.

చివరిగా దేవుడు చెప్పేదానికి నీవు మరేమియు కలుపవద్దు. భవిష్యత్తులో దేవుడు నీకు సిద్ధపరచిన పరిచర్య గురించి నీకు బయలుపరచవచ్చు. కాని అది కొద్ది వారాలలోనే నెరవేరబోతోందని అనుకొనవసరం లేదు. ఆ నెరవేర్పుకు కొన్ని సంవత్సరాలు పట్టవచ్చు. ఇది వ్యక్తిగత అనుభవం నుంచి తెలిసుకున్నాను. ఎటువంటి ఊహలకు తావు ఇవ్వవద్దు. పౌలుకు తన భవిష్యత్తులో ఏమి జరగబోవుతుందో తెలుసు. కాని పూర్తిగా అతనికి తెలియదు. ఎందుకంటే దేవుడు పూర్తిగా ఆయనకు బయలుపరచ లేదు. దేవుడు మనలను విశ్వాసముతో నడవాలని కోరుకుంటున్నాడు.

